మేరీ

చెలికాని వెంకట రామారావుగారు

మదరాసు సముద్రతీరమున జనము ఇంటి మొగము పట్టెరి. కాని యొకప్రక్కను చేపలనావపై యువతీయువకు లిద్దఱు కూర్చొని యున్నారు.

ఆమె తన చేతిసంచిలో నున్న ఒకకవరు నుంచి కార్డుసైజు ఫోటో తీసి, "ఇదిగో నా ఫోటో చూడు" అని చూపించి, ఆయువకుడు దానిని సరిగా చూడకముందే కొంటెతనముగా తీసుకొని ఒక కవరులో పెట్టి దీనిని నీ హృదయసమీపమున నుంచుకొనుమని స్వతంత్రించి చొక్కాజేబులో తన చేతితోనే పెట్టెను. అట్లు చేయుటలో ఆజేబులో దళసరియైన కవ రుండగా దానిని చూచుటకు లాగెను. "ఏమి టబ్బా యిది? ఏదో ఫోటోలాగుందే. నాకొఱకు నీఫోటో తెచ్చినట్లుంది చూస్తే". ఆకవరులోనుంచి ఫోటో తీయనువ్యక్తురాలై రిచ్చర్డు యొక్క మొగమువైపునకు చూచినది. ఆ మోముపై చిరునవ్వు తాండవించుట చూచి,

"ఏమి, చూడవచ్చునా?"

"తప్పక చూడవచ్చును. చూడుము. నీవు ప్రేమతో నీఫోటో యిచ్చినందుకు కృతజ్ఞుడను. ని న్నెప్పుడు ఆప్తమిత్రులలో నొకరినిగా నెంచుకొందును."

ఇంతలో ఆమె ఆఫోటో తీసినది. రూపవతియగు నొక యువతియొక్క ఛాయాపటమది. ఒక్కసారిగా ఆ 'మేరీథామస్' చిన్నపోయినది. మొగమున రక్తబిందువు లేదు. అప్రయత్నముగా పెదవి కొరుకొన్నది. ఒక్కనిమిష మైనతర్వాత చిరునవ్వు నభినయించి, "ఏమి టిది? ఎవ రీ అమ్మాయి? ఆమె క్యాథరిన్ హాల్!"



థామస్ మిస్సమ్మ మొగము మరింత రక్తవిహీన మైనది. నోట మాట రాలేదు.

రిచ్చర్డు ఆసంగతి గ్రహించినాడు.

"మేరీ, ఏమి? ఇంత ఆశ్చర్య మెందుకు?"

మేరీ— ఈమె యెవరో నాకు సరిగా చెప్పు."

రిచర్డు—(చిరునవ్వుతో) నీవంటి స్నేహితురాలితో చెప్పుటకు అభ్యంతరము లేదు. కాని నీవు మాత్రము దయయుంచి యీసంగతి యింకా చాటకు. ఆమె నాప్రియురాలు. నాఆనర్సు పూర్తి అయి ఏదైనా ఉద్యోగము దొరకగానే మేము పెండ్లి చేసుకొందుము. ఇదివర కెప్పుడును సందర్భము కలుగకపోవుట చేత నీతో చెప్పలేదు. మాపెండ్లికి నీవు తప్పక రావలెను సుమా!

మేరీ "తప్పకుండా" అని అనాలోచనముగా పలికెను కాని యామె భావ సముద్రములో గొప్ప తుపాను పట్టిన సంగతి మాత్ర మామె మొగమునందు విస్పష్టముగా గోచరించెను.

రిచర్డు ఈసంగతి గ్రహించి లోతు తెలియక సందేహముతోను, ఆతురతతోను ఆమెను చూచుచుండెను. అట్లు నిశ్శబ్దముగా కొన్ని నిముషములు కూర్చొనియుండిరి. కాని అవి కొన్ని గంటలవలె కన్పించెను.

మేరీ కండ్లు మూసుకొన్నది. తెరవబోవునప్పటికి కన్నీళ్లు ముత్యాలవలె ఏకధారగా ప్రవహించుట ప్రారంభమైనది. మొగము ఎఱ్ఱబారినది. రిచ్చర్డు తెల్లబోయినాడు. చేయి పట్టుకొని,

"మేరీ, ఏమి టిది? చెప్పవా? చెప్పు. ఈకన్నీళ్లకు కారణ మేమి?"

మేరీకి పిచ్చి యెత్తినది. ఇక ఆపుకొనలేక పోయినది. ముందుకు వంగి చేతులలో మోము ముంచి వెక్కి వెక్కి యేడ్వ మొదలు పెట్టినది.

మరింత ఆదరముతోను, విచారముతోను రిచ్చర్డు,

"అమ్మా, మేరీ, చెప్పవా? ఎందు కీ దుఃఖతరంగాలు?"

మేరీ సరిగా కూర్చొనెను. కన్నీళ్లు తుడుచుకొని అప్రయత్నంగా జేబురుమాలుతో పాటు ఫోటోకూడ తన చేసంచిలో పెట్టెను. రిచ్చర్డు ఆసంగతి చూచెను కాని మాటాడ సంకోచించెను. మేరీ మరల తల వంచి కుడిచేతితో నుదురు నొక్కి పట్టుకొనెను. ఏదో గంభీరాలోచనలో నిమగ్నురాలైనది. ఒక్కనిముష మట్లున్నతరువాత తలయెత్తి ఒక పెద్ద నిట్టూర్పు విడిచి కంఠములో నొక వింత మార్దవము వెలుగొందుచుండ ఇట్లనెను:

"రిచ్చర్డు! నిన్ను నమ్ముకొంటిని. ఇంత మోసగాడవా?"

"అయ్యో! నీ కేమి మోసము చేసితిని మేరీ"

"నేను వేరే చెప్పవలెనా? న న్నొక మహాకూపమున త్రోయుచున్నావే!"

మేరీ రిచ్చర్డుచేయి పట్టుకొని దుఃఖము, ప్రేమ, ప్రార్థన కంటతడిలో ఉట్టిపడేటట్లు తన విశాలనేత్రముల వానిప్రక్కకు త్రిప్పి—

"నాప్రాణములు తీసెదవా రిచ్చర్డు? నీ వెరుగవా? ఎన్నిదినాలనుంచో నిన్నే ప్రతి నిమిషం ధ్యానించుచు త్వరలో నిన్ను పొందగలనని యువ్విళ్లూరుచుంటినే? ఇట్లు మోసము చేసెదవా? నాస్నేహితురాండ్రందరు నీపేరు చెప్పి నన్ను హేళనచేసినప్పుడు సిగ్గు, సంతోషము నాహృదయములో నుప్పొంగుచుండునే. నాగతి యేమి టింక?"

రిచ్చర్డు—మేరీ! మనం ఎప్పుడైనా ఆసంగతి మాట్లాడుకున్నామా? నీ వెప్పుడైనా నన్ను పెండ్లిచేసుకొను నుద్దేశముతో ప్రేమించుచున్నానని చెప్పితివా? నిన్నొక ఆప్తబంధువువలె, ఒకమిత్రురాలివలె ప్రేమించితినే కాని ఎప్పుడైనా నీకు వాగ్దానము చేసితినా? ఏమి మేరీ, ఎందుకు నాపై ఈ పిడుగు వేయుచున్నావు? నీ కిది న్యాయమా? నాక్యాథరీన్ సంగతి విని సంతసించెద వనుకొని, ఒక తోబుట్టువువలె నాసంతసములో నీవుకూడ పాల్గొని నాకు మరింత ఆనందము కలుగజేసెద వనుకొంటిని కాని యిదేమిటి కొండ విరిగి మీద బడ్డది!

మేరీ — (ఒక్కనిమిష మాలోచించి) అవును కాని, నీవు నన్నింతకాలము ప్రేమించుట లేదా? నాతో నీవు గడపే సెలవులు, నాకు పంపే అనేకబహుమతులు, నాపుట్టిన దినమున నాకు పంపిన సిల్కు — దీని అర్థ మేమి? నాకొరకై నీవు ఎన్నిసార్లు రాలేదు? ఎన్నిసార్లు సినీమాకు తీసుకొని వెళ్లలేదు? ఎన్నిసార్లు రుచిమంతములైన ఫలహారములు పంపలేదు? ఎన్ని పుస్తకములు, ఎన్ని బహుమతులు పంపలేదు? నీవు పరీక్ష కృతార్థుడ వైతివనో, క్రిస్మసుపండుగనో, వత్సరాదిఅనో నీకు తెలియకపోయినా నాశక్తికి మించినవి ఎన్నివస్తువులు ప్రేమతో మక్కువతో నీకు ఈయలేదు? ఇవన్నియు అన్యోన్య ప్రేమసూచకములు కావా? మన ఉత్తర ప్రత్యుత్తరములున్ను ప్రేమవలన కావా? ఇప్పుడన్నీ మంట గలపవలసినవేనా? నన్ను సదా తలచుకొందువని, నాశ్రేయస్సు కోరితివని ఎన్నెన్నిసారులు జాబులు వ్రాయలేదు? నీవు చదువునపుడు ఏదైన మంచి పద్యముగాని, వాక్యము గాని నీకు నచ్చిన నాకు వ్రాసి పంపేవరకు తోచదని ఎన్నిసార్లు చెప్పలేదు? నీవివన్ని చేయవచ్చును కాని వానివల్లన నాయందు నీకున్న ప్రేమను గ్రహించి తిరిగి నా నిష్కల్మషమైన ప్రేమపుష్పమును నీకు సమర్పించుట నాదోషమా? నీవల్ల ఆకర్షింపబడి పిచ్చిదాననై నాహృదయమును సంపూర్ణముగా నీ అధీనముచేసి అహర్నిశలును సర్వదా నిన్నే తలచుకొనుచు, ఏమి చదివినా, ఎవ్వరిని చూచినా నిన్నే ధ్యానించుచు ఉన్నందుకు ఇదా ఫలితము? ఇది నీకు న్యాయమా? నావంటి అమాయకురాలి గాఢమైన, సంపూర్ణమైన, నిష్కలంకమైన, హృదయపూర్వకమైన ప్రేమ నీకు ఆటవస్తువా? నాహృదయము వ్రక్కలగుట నీకు నిర్లక్ష్యమా? రిచ్చర్డు! నీ కిది న్యాయమా?

రిచ్చర్డు—మేరీ! (నిట్టూర్పు విడిచి) మేరీ! అయ్యో! నీ కీభావ మున్నదని నా కిసుమంతయైన దృష్టి లేదు. నిజము, నమ్ము. నీకు సోదరీసోదరులు, బంధువులు ఎవ్వరు లేకపోవుటవల్ల నీనిష్కల్మషజీవితము, నీ సహజసంతోషము నీమంచితనము, నీప్రేమస్వభావము చూచి నిన్ను ప్రేమించిన సంగతి నిజము. కాని ఒక మిత్రురాలివలె, సోదరివలె, ప్రేమించితిని కాని వేరొక యుద్దేశ్య మెన్నడు లేదు. నీవు మారభిప్రాయములో నుండుట వింత గాదు, విచారముగా నున్నది. మేరీ, నీయెడ నేను చూపిన అభిమానము కాని, నీకు నే నొసంగిన స్వల్ప కానుకలు గాని సోదరీప్రేమతో గావించితిని. నాచెల్లెలే యిచ్చట ఉన్నయెడల ఆమెకై అందులో ఏమి చేయను? చెప్పు. నిన్ను సినీమాలకు తీసుకొనివెళ్ళిన నిన్ను ఆనందింపజేయుటకు నాస్వల్పశక్తి ననుసరించి నీకు కానుకలు పంపిన సాధ్యమైనంతవరకు నీకు సోదరులు లేనిలోటు తీర్చుటకై ప్రేమపూర్వకముగా పంపియుంటిని. అందు దోష మేమున్నది?

మేరీ:—చాలులే...కాని, రిచ్చరు! నీవు నిజముగా ఆమెను ప్రేమించుచున్నావా?

రిచ్చర్డు—అవును.

మేరీ—ఆమె నిన్ను ప్రేమించుచున్నదా?

రిచ్చర్డు—అవును.

మేరీ—నాకంటె గాఢముగ ప్రేమించుచున్నదా?

రిచ్చర్డు—నే నాసంగతి చెప్పజాలను. నీప్రేమను నే నాదృష్టితో చూడలేదు. కనుక చెప్పజాలను.

మేరీ—అసంభవము, నావంటి వెర్రిది మరొకతె యుండదు. నాయంత గాఢముగా మరొకతె ప్రేమించగలదని నే ననుకొనను... ఛీ! నాయంతటి మూర్ఖురాలు వేరొకతె లేదు. సరి. రిచ్చర్డు! నాహృదయకలశము నిండార సమర్పించిన ప్రేమామృతమును తన్నుకొని గర్వముతో వెళ్లుచున్నావు. నా హృదయమును వ్రక్కలు చేసితివి....పురుషులెంతటి స్వార్థపరులు!...చూడు, రిచ్చర్డు! నన్ను పెండ్లి చేసుకొనవా?

రిచ్చర్డు—అయ్యో, మేరీ! క్షమింపుము. అది అసంభవము.

మేరీ—సరి. నావంటి అమాయకురాలిని కూలద్రోసి దుఃఖసముద్రమున ముంచుచున్నావు. జ్ఞాపక ముంచుకొనుము. నాకు నీ ప్రేమతోను, నీతోను, బహుశా నాజీవితమందలి యుత్సాహముతోను నేటితో సరి.

అని లేచెను.

రిచ్చర్డు—మేరీ, ఇందు నాదోషము లేదు సుమా.

మేరీ—నీతోను, నీదోషముతోను నా కింక పనిలేదు.

అని రోడ్డువైపునకు నడువ ప్రారంభించెను. రిచ్చర్డు లేచి వెంట పోవుచుండెను. నాలుగడుగులు వేసినతర్వాత,

మేరీ—దయయుంచి నాతో రావద్దు.



'దయయుంచి నాతో రావద్దు'

రిచ్చర్డు—రాత్రి అయినది. నిన్ను సెంట్రల్ వరకు దిగబెట్టెదను.

మేరీ—అవసరము లేదు.

రిచ్చర్డు—పోనీ, బస్సు దగ్గరకు దిగబెట్టెదను.

మేరీ—వద్దు, నీ కా శ్రమ అక్కరలేదు.

రిచ్చర్డు నిర్ఘాంతపడిపోయెను. ఏమిచేయుటకు తోచలేదు. కాని వెంట నడచుచుండెను. కొంతసేపైన తర్వాత...

రిచ్చర్డు—బుధవారం డగ్లసుఫిల్మున్నది, వస్తావా?

మేరీ—సిగ్గు లేకనా?

రిచ్చర్డు—నేను నిన్ను మరల ఎప్పుడు చూడగలను?

మేరీ—నన్ను చూచుటకై నీ వెన్నడు రావద్దు.

రిచ్చర్డు—కొద్దిరోజులు పోయినతర్వాత జాబు వ్రాసెదను.

మేరీ—వద్దు. వృథాశ్రమ పడకు. నీ ఉత్తరములతో నాకు పనిలేదు. వచ్చిన చదవకుండగనే చించివేసెదను.

రిచ్చర్డు—అనుకోనకుండగనే నీమనస్సు నొప్పించితిని.

మేరీ—సరే కాని, దయయుంచి యిప్పుడైనా నన్నొక్కతెనే పోనిమ్ము.

రిచ్చర్డు— అయితే సెలవిమ్ము. 'గుడ్ నైట్.'

మేరీ—నీవే శాశ్వతమైన సెలవు ఇచ్చియుంటివి. వేరే సెలవు అక్కరలేదు.

అని వెనుకకు చూడకుండ త్వరగా నడచి బస్ ఎక్కి సెంట్రల్ స్టేషన్ దగ్గర దిగి తనబసకు వెళ్లెను.

౨

మేరీ థామస్ ఒక అనాథబాలిక. మైలాపూరులో నున్న కాన్వెంటు అనాథశరణాలయములో పెరిగెను. కేంబ్రిడ్జి సీనియరు పరీక్షకు వెళ్లి అందులో తప్పి జనరల్ ఆస్పత్రిలో నర్సుగా ప్రవేశించి పని నేర్చుకొని నర్సు పరీక్షలో కృతార్థురాలైనది. కాన్వెంటులో పెరు

గుటచేత సహజముగా పూర్వాచారపరా యణురాలు. ఏసుక్రీస్తునందు, మతాధికారుల యందు అచంచలభక్తి. సన్యాసినులైన 'నన్సు' అన్నను, వారి ప్రార్థనాద్యనుష్ఠానము లన్నను ఎంతో గౌరవము. వారి ప్రార్థనలు, ఉపన్యాస ములు, కఠోరదీక్షలు, జీవితనిబంధనలు చూచి వారి నందరిని భగవంతుని యొక్క ఆత్మీయ పుత్రికలవలె భావించి భయభక్తులతో పూ జించును.

రోజులు గడచినవి. కాని మేరీక్రోధాగ్ని చల్లారుటకు బదులు కాంక్షతో తీవ్రమై హృదయమును దహించుచుండెను. రిచ్చర్డు రెండుసార్లు సానుతాపముగ ప్రేమరాగ ముట్టి పడునట్లు జాబులు వ్రాసెను. మేరీ అవి చదువు కొనెను. కాని జవాబులు వ్రాయలేదు. మేరీ పుట్టినదినము వచ్చెను. ఆ రోజున రిచ్చర్డు ఆమెకు కొన్నిపండ్లు, ఒక చక్కని చేసంచి పంపెను. ఆమె వానిని త్రిప్పివేసెను.

తరువాత వారచ్చటచ్చట కలసినప్పుడు రిచ్చర్డు ఒకటిరెండుసార్లు ఆమెకు వందన మొనర్చి కుశలప్రశ్న చేసెను. మాటాడుటకు ప్రయత్నించెను. కాని ఆమెమొగము చిట్లిం చుకొని మాట్లాడలేదు. తరువాత రిచ్చర్డు అట్టిప్రయత్నము మానుకొనెను.

ఆదివారమునాడు చర్చికి ప్రార్థనకు వెళ్లెను మేరీ. అప్పుడు ఉపాసకుడు శత్రుభావ మనాగరికమనియు, ద్వేషము త్యజింపుమనియు బోధచేసి, యితరుల నీతో సమానముగా ప్రేమింపు మనెడి యేసుక్రీస్తు బోధించిన ధర్మ సూత్రమునుగురించి వివరించి చెప్పెను.

3

మేరీకి క్రోధము హెచ్చిపోవుచుండెను. స్నేహితులు క్రమముగా సంగతి గ్రహించిరి. మేరీ ఆటలాడుట మానెను. పూర్వపు సహజ సంతోషచిద్విలాసములు పోయి నిత్యము దీర్ఘా లోచనలోను, విచారములోను మునిగియుం డెను. దుఃఖము, ద్వేషము ఆసున్నితమైన హృదయమును వర్ణనాతీతముగ దహింప జొచ్చెను.

కాలము మానవమనఃపరిస్థితుల ననుస రింపదు. కాలచక్రము తిరిగిపోయెను. అది ఆగస్టునెల. వర్షము హోరున కురియుచుండెను. మేరీ రాత్రి వార్డులో పనిచేయుటకై వచ్చి కోటు తీసివేసి, పగలు పనిచేసిన 'సోదరి క్లా రెన్సు' వద్ద పని అప్పగించుకొనుచుండెను. కడు జాగరూకతతో చూడవలసిన రోగులగూర్చి చెప్పుచు, "క్యాథరిన్ హాల్ నన్ని పాతజ్వరము జాగ్రత్త. రాత్రి 8 గంటలవేళ మం దీయ వలెను. కనిపట్టి చూచుచుండుము. తలకు మంచుగడ్డ అవసరమైనప్పుడెల్ల మరల వేయు చుండుము." అని అంతయు నప్పగించి క్లారెన్సు వెళ్లిపోయెను. రాత్రి 11 గంటలైనది. మేరీ కుర్చీలో కూర్చొనియుండెను. మనస్సు పరి పరివిధముల బోవుచుండెను. తాను ప్రేమిం చిన రిచ్చర్డుయొక్క ప్రియురాలే యీక్యాథ రిన్. ఈమెకు చేసిన వాగ్దానమువల్లనే రిచ్చర్డు

తనను నిరాకరించెను. తన మనోభీష్టమునకు ఈమెయే అడ్డువచ్చెను. ఈ టైఫాయిడ్ జ్వరము వల్ల ఈమె చనిపోయిన రిచ్చర్డు తనను ప్రేమించునో యేమో. అదృష్టము బాగుండిన టైఫాయిడ్ జ్వరము క్యాథరీనకు మృత్యు రూపిణియై తనకు తోడ్పడగూడదా?...

ఇట్లు చిత్తము వచ్చినట్లు మనస్సు చరించుచుండెను. క్యాథరీన్ హాలునకు మేరీ సంగతి యేమీ తెలియదు. మరునాటి రాత్రి తిరిగి మేరీ యిట్లే ఆలోచింపదొడగెను,— "ఈమె చనిపోతే ఎంతో బాగుండును. .... ఛీ! నావృత్తి యేమి! నా దుర్మార్గపు ఆలోచన ఏమి!... ... చనిపోతే, తీరెనా నా కోర్కెయు తీరును, లేదా, రిచ్చర్డునకు తగిన శాస్తియగును." మరునాడు తనగదిలో కూడా ఇదే ఆలోచన, "క్యాథరిన్ యొక్క మృత్యు వెట్లు నిశ్చయమగును? నమ్మకము లేని రోగముపై ఆధారపడుటకంటె నమ్మకమైన మార్గము వేరొకటి లేదా?.....ఎన్ని అమోఘమైన విషములు లేవు! కాని యుత్కృష్టమైన నర్సు పని చేయుచు మృత్యుముఖమునుండి తనసంరక్షణవలన కాపాడవలసిన తా నట్టి ఘోర పాపమున కొడిగట్టిన, రహస్యము నెల్ల చూచుచుండెడి ప్రభువునకు తా నేమి సమాధానము చెప్పగలదు? నరకకూపమున త్రోయడా? ..."

ఇట్లు రెండుమూడు రోజులు గడచినవి. తన హృదయము నట్లు రిచ్చర్డు వ్రక్కలు చేయవచ్చునా? ప్రతీకారము చేసి తీరవలెను; పాపము కాని, పుణ్యము కాని; పగ తీర్చుకొని తీరవలెను. హాల్ మిస్సమ్మకు జ్వరము 10 వ రోజు. చాలా తీవ్రమైన జ్వరము వచ్చుచుండెను. ఆరాత్రి మేరీ రోగుల కీయవలసిన మందు లిచ్చి హాల్ మిస్సమ్మకు ఇచ్చుటకు ఔన్సుగ్లాసు పట్టుకొని మందుల బీరువా వద్ద తటపటాయించుచు నిలుచుండెను. "ఇచ్చి తీరెదను" అని నిశ్చయించుకొని తాను తెచ్చిన నల్లమందు ద్రావకము 1 ఔన్సు పోసెను. చేతులు వడకుట ప్రారంభించెను. హృదంతరాళమునుండి "నీ వెన్నడు హత్య గావింపకు" మనెడి క్రీస్తుబోధ వినబడుచుండెను. "కసి తీర్చుకొనుము" అని రెండవప్రక్క నుంచి అసురభావము ఘోషించుచుండెను. "నీవు చేసినట్లు ఎవరికి తెలియుట శక్యము కాదు. ఇంత జబ్బుస్థితిలో చనిపోయిన అన్యథా యెవ్వరు తలంపరు. చివరకు రిచ్చర్డు నిన్ను పెండ్లిచేసుకొనునేమో" అని స్వార్థము ప్రోత్సహింప, తడబడుచున్న అడుగులతో క్యాథరిన్ వద్దకు పోయెను. "థామస్ మిస్సమ్మా, వచ్చినావా తల్లీ" అని ప్రేమపూర్వకముగా ఆమె మేరీ చేయి పట్టుకొనెను. మేరీ కంపించుచుండెను. ఏమిటో సమాధానము చెప్పెను. ఆమె కేమియు తెలియలేదు. మందు త్రాగమని చెప్పెను. క్యాథరిన్ నోరు తెరచెను. వణుకుచున్న చేతితో మందుగ్లాసు వంచుచుండెను. ఆమహాసంఘర్షణసమయమున నొక మహావిచిత్రమైన మార్పు కలిగెను. మేరీ ఆమెమొగము వైపు వెర్రిచూపు చూచుచుండెను. నిర్మల

మైన, నిర్దోషమైన ఆమె మొగము యేసుక్రీస్తు



మొగముగా మారిపోయెను. "మేరీ, మేరీ! నేను నీఉపచారములు కోరి బాధానివారణార్థము ఔషధామృతము కోరుచున్నాను గాని నీవు మృత్యురూపమైనవిషము నొసంగుచున్నావా? సరే పోయుము" అని యేసుప్రభువు నోరు తెరచి నట్లు మేరీకి ప్రత్యక్షమాయెను. శరీరమంతయు కంపించెను. చేయి వెనుకకు మరలి పోయెను. ఏమి చేయుచున్నదో తెలియకనే తన బల్ల వద్దకు బోయి ఆమందు పారబోసి గ్లాసు కడిగి వేసి ఆమూలాను మోకాళ్లపై వ్రాలి, "హే యేసుప్రభూ! ఈ పాపిని, ఈ నీచురాలిని మన్నింపుము. ప్రభూ! పరీక్షాకాలమున, ఈ ఆపత్కాలమున నన్నెట్లు కాపాడితివి? తండ్రి! ఈకంఠమున ప్రాణ మున్నంతవరకు కృతజ్ఞురాలనై యుండెదను. నా హృదయమందలి పాపపంకమును దగ్ధము చేయుము. ప్రభూ! మన్నింపుము. నీవు నాఘోరపాపముల మన్నించునట్లు ఇతరుల తప్పుల నేను సహించి ఓర్చుకొందునుగాక! ధన్యురాలను. నీసేవయం దిక నాజీవితము ధన్య మొనరించుకొందును. ప్రతి వ్యక్తిలోను నీవు ప్రత్యక్ష మగుచున్నావు. ముమ్మాటికి ధన్యురాలను." అని ప్రార్థన గావించి లేచి యొకనూతన తేజస్సు, నిర్మలప్రేమామృతము మొగమున తాండవింప క్యాథరిన్ వద్దకు పోయి మందిచ్చి ముద్దుపెట్టుకొని ప్రక్కను కూర్చొని బైబిలు విప్పి యేసుక్రీస్తు బోధల చదివి వినిపించి, క్యాథరిన్‌కు నిద్ర వచ్చుచుంటచే సంతోషచిత్తముతో తన బల్ల వద్దకు వచ్చి బైబిల్ చదువుకొనుచుండెను.

౪

మరునాడు సాయంకాలము రిచ్చర్డు కాలేజీనుంచి రాగానే తన యుత్తరములలో చిర పరిచితమైన మేరీదస్తూరీతో జాబు ఉండుట చూచి వెంటనే యాశ్చర్యముతో చింపి చదువుకొనెను.

"ప్రియమిత్రమా, నావద్దనుంచి జాబు వచ్చునని నీ వనుకొనియుండవు. కాని నాలో నూతనమగు మార్పు, నూతనవికాసము కలిగినది. నాజీవితములో నింక క్రోధద్వేషములకు తావు లేదు. నీయెడ నింతవరకు కఠినురాలనై ఘోరపాపమును గావించితిని. ఏకాకినై అనాథ

బాలికనైన నాయెడల నీవు దయతో జూపిన నీ నిర్మల-అవ్యాజానురాగమునకు అవమానము, కాఠిన్యము ప్రతిగా నొసంగితిని. అహంకారము, స్వార్థము, సంకుచితభావము, నీచత్వమే యిందుకు కారణములు మిత్రమా, ఒకసోదరునివలె నన్నెప్పుడు ఆదరించుచుంటివి. ఈఅల్పురాలిని, కఠినురాలిని, స్వార్థపరురాలిని క్షమింపుము. దయాస్వరూపుడవైన నీవు నన్ను తప్పక మన్నింతువని తెలియును. నేనట్టిక్షమకు అర్హురాలను కాననికూడ పూర్తిగా నెరిగియుండుటవలన సిగ్గుచే క్రుంగిపోవుచున్నాను. కాని యేసుప్రభువు దయవలన నాకొక నూతనజ్యోతి లభించినది. దాని దివ్యకాంతిలో ఈజీవితము సదా ప్రకాశప్రశాంతములతో గడవ గలదు. అందుచే నీవంటి ఉత్తముల ద్వారా యేసుప్రభువు ముందట సాష్టాంగపడి, గతించిన అజ్ఞానావృతము, కాంతావిబద్ధము, పాపభూయిష్ఠము నైన అంధకారజీవితప్రకరణమును మూసివేసి నే గాంచిన నూతన జ్యోతియొక్క ప్రేమామృతశీతలకిరణజాలములను నేటినుంచి యథాశక్తిని సేవారూపమున ప్రతిఫలింప జేసెదను. ప్రియమిత్రమా, రిచ్చర్డు! కామద్వేషపూరితమై, అంధురాలై, అధఃపతితురాలై, సంకుచితపాపమార్గగామినినై, పోయిపోయి యీనాటికి మేల్కొని కండ్లు తెరచి శ్రేయోదాయకమైన కాంతావిరహితప్రేమమార్గమును గాంచి, పరుగుపరుగున ఆ నూతనమార్గముకొఱకై పోవుచున్న యీదీనురాలిని మన్నింపుము. సర్వసాక్షియైన భగవంతుడు కూడ నన్ను మన్నించుగాక! ఈదీనురాలి అహర్నిశప్రార్థనల నాలించి ఆకరుణాస్వరూపుడు నిన్ను, నీప్రియురాలిని సర్వదా కాపాడుగాక!

"ఇట్లు: నీశ్రేయోభిలాషిణి,
"మేరీ థామస్".

వెంటనే రిచ్చర్డు మేరీని చూచుటకు పరుగున బోయెను. వీరి అన్యోన్యస్వచ్ఛందప్రేమ సహస్రకళలతో వారిమొగముల ప్రకాశింప, నిద్దరి కండ్లనుండియు ఆనంద బాష్పములు దివ్యతేజస్సుతో రత్నదీప్తిని ప్రకాశించెను. తరువాత నతడు క్యాథరిన్ ను చూచుటకై ఆమెవద్ద సెలవు తీసికొని వెళ్లిపోయెను.

౫

క్రమముగా ఐదుదినములు గడచిపోయెను. క్యాథరిన్ హాలునకు జబ్బు హెచ్చినది. మేరీ యెంతయు జాగ్రత్తగ నుపచారములు చేయుచుండెను. మేరీ నూతనవ్యక్తిగా మారిపోయెను. ఆకార్యదీక్ష, ఆయుత్సాహము, ఆనిరంతరమందహాసము పూర్ణచంద్రప్రకాశమువలె నానందము వెదజల్లుచుండెను. నలుప్రక్కలకును సదా ప్రేమామృతవృష్టి గావించుచుండెను. కాని ఆరవదినము రాత్రి క్యాథరిన్‌యొక్క స్థితి తీవ్రరూపముదాల్చి తెల్లవారుజామున జీవితము చాలించెను. ఆప్రేమమందాకినియొక్క జీవితయాత్ర పూర్తియయ్యెను.

బయట అంతయు చీకటి. ఆకాశమున నక్షత్రములు ప్రకాశించుచుండెను. మేరీకి అది వజ్రాయుధఘాతమైనది. ఆప్రశాంతసమయ

మున నామె ఏకాంతముగ వసారాలో ఒకమూలను మోకాళ్లపై వ్రాలి, అశ్రుజలములు ధారలై ప్రవహింప, "అయ్యో! నా కుటిలత్వమే, నా దుర్మార్గపు తలంపులే ఆమెకు మృత్యురూపమైనవా తండ్రీ! మన్నింపుము. ప్రభూ! ఈపాపినిని, ఈదీనురాలిని మన్నింపుము. మనోవాక్కాయకర్మల నీసేవయందే నిమగ్నురాల నగుదును గాక! ఆశీర్వదింపుము, తండ్రీ ఆశీర్వదింపుము! ఆఅమాయకురాలి నిర్మలాత్మకు సదా శాంతి నొసగుము. తండ్రీ! స్వర్గమున ఆమెను నీదరి జేర్చుము" అని ప్రార్థించెను.

౬

మహాశక్తియగు కాలము మానవహృదయమున విపత్పరంపరలచే గల్గిన ఘోరములగు గాయములను మాన్పి తత్సంబంధమైన అగాధకూపములను క్రమక్రమముగా గమనింపబడకయే పూడ్చివేయును. ఐదువత్సరములు గడచినవి. రిచ్చర్డు క్రిస్టియనుకళాశాలలో లెక్చరరుగా నున్నాడు. క్యాథరిన్ యొక్క ఆకస్మికమరణమువలన కలిగిన హృదయచ్ఛేదకమైన లోటును పటుత్వమైన ధ్యేడున్నతాశయమును లేకపోవుటచే తీర్చ లేకపోవుటయే గాక, నానాటికి జీవితము ఆనందరహితమై నిస్సారమగుచుండెను. కొంతకాల మానిర్మలప్రేమచే వివాహోద్దేశము తలపెట్టలేదు. కాని కాలవశమున క్రమముగా బ్రహ్మచర్యవ్రతము బాహ్యమున కేవలము వ్రతముగా నిలిచి అంతరంగమున నిస్సారమై అశాంతికి కారణమయ్యెను.

అనేకదినములు ఆలోచించి, ప్రారంభమున సందేహానిమగ్నమైన మనస్సున ధైర్యము నెలకొల్పి, యొకనాడు సముద్రతీరమున నేకాంతమున మేరీతో తనజీవితము శాంతి కాని, సౌఖ్యము కాని లేక ఎడారివలె నున్నదని చెప్పి, సందేహించుచు క్రమముగా తన్ను జేపట్టి తన యంధకారబంధురమైన జీవితములో ప్రేమోత్సాహజ్యోతి నెలకొల్పి కాపాడవలెనని కోరెను. మేరీ తన ప్రశాంతముఖమునందును, విశాలనేత్రములందును కనికరము ఆదరము తాండవింప, ఒక వింత మందహాసముతో రిచ్చర్డు చేయి పట్టుకొని, "మిత్రమా, నాభావప్రపంచమును నీవు పూర్తిగా తెలుసుకొనలేదు. నేను నిన్ను గాని, మరెవ్వరిని గాని వివాహమాడి సంసారసేవకు పూనుకొనిన, మానవసేవారూపమున భగవంతుని సేవించుట అసంభవము. ఏసుప్రభువు చెప్పినది జ్ఞాపకము



లేదా? ఇద్దరు ప్రభువుల సేవింప శక్యమా? నా జీవితమును బంధదాయకమైన సాంసారిక సేవకు బదులు ముక్తిదాతయైన ప్రభుని సేవించుటకు గడుపుచున్నాను. నాకు మానవసేవయే భగవత్సేవ. మిత్రమా, జీవితమందలి నీదృక్పథము మార్చుకొనుము. అప్పుడు అన్యజనసాహాయ్యమక్కరలేకయే జీవితమందలి అంధకారము పటాపంచలై దుఃఖపూరితమైన బ్రతుకు ఉత్సాహపూరితమై తేజోవంత మగును. నా వద్దకు వచ్చు ప్రతివ్యక్తిలోను ఒక్కొక్క నూతనరూపమున యేసుప్రభువు ప్రత్యక్షమగుచున్నాడు. ప్రతిదినము అనేకశరీరములలో నామహామహుని మనసార సేవించుచున్నాను. ఇట్టి మహోత్కృష్టావకాశము కాళ్ల దన్నుకొని సంసార కూపమున బడిపోయిన నా కిట్టి యదృష్టము లభించునా? ప్రియ మిత్రమా, రిచ్చర్డు! మన్నింపుము. చక్కగా ఆలోచించిన నీకే ఈ యుత్కృష్టాదర్శజ్యోతి ప్రత్యక్షమై తీరును. నిరాశ, నిరుత్సాహము నీహృదయమునుంచి పారద్రోలు"మని అమృత తుల్యముగా పలికెను.

౭

మరునాడు సాయంకాలము మేరీ తన వార్డులో బల్లవద్ద కూర్చొని ఉదయమున రిచ్చర్డు వ్రాసిన జాబు చదువుకొనుచుండెను:

"ప్రాణప్రదమైన మేరీ, నాసంకుచితభావములవలన నీయొక్క మహోన్నతదివ్యాదర్శ జీవితదృక్పథము గ్రహింపజాలకపోతిని. ఇప్పుడే కండ్లు తెరచితిని. ఇప్పుడు దానిని ఒక ఛాయారూపముగా మాత్రముచూడగలుగుచున్నాను. గ్రహించుచున్నాను. నీజీవితము ధన్యము. నన్నుగూడ ధన్యుని గావింపవా? ఈపవిత్ర జీవితయాత్రయందు అంధుడనైన నాకు చేయూత నొసగుము. ఒక్క నూలుపోగు ఆధారము దొరకిన దాని బట్టుకొని నీఅడుగులజాడ బడి వచ్చెదను. తద్ద్వారా కొంతకాలమునకైనను వెలుతురును గాంచగలుగుదును. జీవితము ధన్యమగును. ఇకనుంచి నీవే నాకు దేవతవు. నామార్గదర్శినివి. మేరీ, నీ కనేకధన్యవాదములు, కృతజ్ఞతాపూర్వక సహస్ర సాష్టాంగప్రణామములు.

"ఇట్లు నీఅనుచరుడు,
"రిచ్చర్డు."

ఆనందజ్యోతి మొగమున ప్రకాశించుచుండ తిరిగి చదువుకొనునంతలో నొక ఒడలు కాలిన రోగి "అమ్మా, అమ్మా, మంట భరింపలేను. నో రెండుకొని పోవుచున్నది. కొద్దిగా మంచినీళ్లియి తల్లీ!" అని యరవ, మేరీ మంచినీళ్లు పట్టుకొని యతనివద్దకు పరుగు పరుగున పోయెను.